# ఓటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

- 105 భవనాల్లో 289 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు
- ఎన్నికల విధుల్లో 1,500 మంది సిబ్బంది, అధికారులు
- 380 ఈవీఎంలు, వీవీ ప్యాట్‌ల ఏర్పాటు
- బరిలో 31 మంది అభ్యర్థులు
- ఓటర్లు 3,01,788 మంది


ఎన్నికల కోసం సిద్ధంగా ఉంచిన ఈవీఎంలు

ముషీరాబాద్, నవంబర్ 29: ముషీరాబాద నియోజకవర్గంలో శాసన సభ ఎన్నికల ఏర్పాట్లు పూర్తయ్యాయి. గురువారం జరుగనున్న ఎన్నికల కోసం అధికార యంత్రాంగం సర్వం సన్నద్ధమైంది. తెలంగాణ శాసన సభ ఎన్నికల్లో భాగంగా ముషీరాబాద్ అసెంబ్లీ స్థానానికి జరుగుతున్న ఎన్నికల నిర్వహణ కోసం 105 భవనాల్లో 289 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. సజావుగా ఎన్నికల ఓటింగ్ ప్రక్రియను నిర్వహించడానికి అధికారులు పట్టిష్ట ఏర్పాట్లు చేశారు. బుధవారం సాయంత్రానికి అన్ని పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలు, ఎన్నికల సిబ్బంది చేరుకొని ఓటింగ్‌కు అవసరమైన ఏర్పాట్లు చేశారు. ఎన్నికల నిర్వహణ కోసం 289 ఈవీఎంలు, 91 రిజర్వు ఈవీఎంలు అందుబాటులో ఉంచారు. 1,500 మంది అధికారులు, సిబ్బంది ఎన్నికల విధులు నిర్వహించనుండగా 500 మంది పోలీసులు బందోబస్తు చూస్తున్నారు. స్థానిక పోలీసులతోపాటు అదనపు బలగాలతో ఎన్నికలకు ఎలాంటి ఆటంకం కలుగకుండా పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశారు. పోలింగ్ కేంద్రాలు, చుపట్టుపక్కల నిఘా ఏర్పాటు చేయడంతోపాటు స్థానిక పోలీసుల, ప్రత్యేక బలగాలతో భద్రతను కట్టుదిష్టం చేశారు. 30 సమశ్యాత్మక పోలింగ్ కేంద్రాల(12 పోలింగ్ స్టేషన్‌లు) వద్ద అదనపు భద్రతా ఏర్పాట్లు చేశారు. ముషీరాబాద్ నియోజకవర్గంలో మొత్తం 3,01,788 మంది ఓటర్లు ఉండగా వీరిలో పురుషులు 1,55,168, మహిళలు1,46,607, ఇతరులు 13 మంది ఉన్నారు. నియోజకవర్గంలో ఆరు డివిజన్‌లలో ఎన్నికల నిర్వహణ(ఓటింగ్) 289 పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. ఒక్కో పోలింగ్ కేంద్రంలో నలుగురు ఎన్నికల సిబ్బంది విధులు నిర్వర్తిస్తారు. 26 రూట్‌లలో ఒక్కో సెక్టోరియల్ ఆఫీసర్స్ తోపాటు మొత్తం 1,500 మంది ఎన్నికల విధులు నిర్వర్తిస్తారు. నియోజకవర్గంలో సీనియర్ సిటిజన్స్ 6,780 మంది, దివ్యాంగులు 1,659 మంది ఉన్నారు. దివ్యాంగులు, వృద్ధుల కోసం ఇంటి వద్దనే ఓటు వేసే అవకాశం కల్పించగా పలువురు ఇప్పటికే తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మిగిలిన దివ్యాంగులు, వృద్ధులు ఓటు వేయడానికి మూడు చక్రాల సైకిళ్లు(వీల్ చైర్‌లు) అందుబాటులో ఉంచారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎన్నికల ఓటింగ్ జరుగుతుందని, పకడ్బందిగా ఓటింగ్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి లక్ష్మీనారాయణ తెలిపారు. పోలింగ్ కేంద్రాల వారీగా సిబ్బంది నియామకం, సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.


ఈవీఎంలతో పోలింగ్ కేంద్రాలకు వస్తున్న సిబ్బంది

## అన్ని వర్గాలను మెప్పించిన నటుడు రేలంగి


రేలంగి చిత్ర పటానికి నివాళులర్పించిన దర్శకుడు రేలంగి నరసింహారావు, వంశీరామరాజు

ముషీరాబాద్, నవంబర్ 29 : రేలంగి ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో బుధవారం చిక్కడపల్లి త్యాగరాయగానసభలో అలనాటి హాస్య నటుడు రేలంగి సంస్మరణ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రముఖ సినీ దర్శకుడు రేలంగి నరసింహారావు ముఖ్య అతిథిగా పాల్గొని రేలంగి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ రేలంగి నటనా అద్భుతం, అనితర సాధ్యమని కొనియాడారు. విభిన్న పాత్రలలో అన్ని వర్గాల ప్రేక్షలను మెప్పించి తెలుగువారి గుండెల్లో చెరగని ముద్ర వేశారని అన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సినీ సంగీత విభావరి, సాంస్కృతిక కార్యక్రమాలు శ్రోతలను అలరించాయి. చంద్రశేఖర్, శంకరనారాయణ, టి. రామసత్యనారాయణ, వంశీ రామరాజు, దైవజ్ఞశర్మ, ఆర్ఎ. నారాయణరావు, రాజ్యలక్ష్మి, రామారావు, రేలంగి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## తెలంగాణ దీక్షా దివస్..



తెలంగాణ దీక్షా దివస్ సందర్భంగా రాంనగర్ చౌరస్తాలోని అమర వీరుల స్థూపం వద్ద బుధవారం జరిగిన కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి పాల్గొని అమరవీరుల స్థూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీఆర్ఎస్ నాయకుడు సిరిగిరి శ్యామ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నేత శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, భిక్షపతి, సిద్ధిఖీ, సిరిగిరి కిరణ్ పాల్గొన్నారు. **– ముషీరాబాద్, నవంబర్ 29**

